# న్యాయమెక్కడ...?

ఇది నా మొదటి కథ, కృష్ణా పత్రికలో 1960వ సం॥ జూలై 2వ తేదీ సంచికలో అచ్చయింది. ఈ కథ అచ్చయినపుడు నాకు 17 ఏళ్లు. నేనెప్పుడో పోగొట్టుకున్న ఈ కథను, విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజర్ పి. రాజేశ్వరరావు గారు వేటపాలెం లైబ్రరీ నుండి తెప్పించి ఈ సంకలనంలో చేర్చినందుకు కృతజ్ఞుడను. – సింగమనేని నారాయణ.

❖ ❖ ❖

ధనవంతుల కుమారులకు వలె నాకు మెత్తని పరుపులు–దిండ్లు–కాశ్మీరు శాలువలు–లేవుగాని, నా అంతస్థుకు తగ్గ ఒక జముకాణము – దుప్పటి మాత్రం వున్నాయి.

ట్వీడ్‌పాంట్లు – షార్క్‌స్కిన్ స్లాగులు–సిల్కుషర్ట్సు–లేవుగాని, చవుకబారు అంగీలు – ముతక పంచెలు మాత్రం వున్నాయి.

మేడల్లో వుండి ఎలెక్ట్రిక్ దీపాల వెలుగులో చదువలేదుగాని, గుడిసెలో వుంటూ కిరసనాయిలు దీపం వెలుగులో చదివేవాణ్ణి.

హోటల్లో వుంటూ మృష్టాన్న భోజనం తినలేదుగాని, స్వయంపాకము చేసుకొని తినేవాణ్ణి.

ఇవన్నీ చదివిన మీకు నేను ఒక పేద విద్యార్థిని అని స్ఫురిస్తుంది...అవును...నేను...బీదవాణ్ణి...ప్రీ యూనివర్సిటి బీదవిద్యార్థిని... ఇటువంటి నాకు పరీక్ష ఫీజు ఏబది రూపాయలలో ముప్పది పోయాయంటే నా మనసెలా వుంటుందో మీకు తెలుసా? ఊహు...మీలో చాలామందికి తెలియదు. నావంటి వానికి మాత్రమే తెలుస్తుంది. అది పోయిపోయి, రేపు పరీక్ష ఫీజ్ కట్టవలసిన రోజనగా పోయింది. ఇంత స్వల్పకాలంలోనే నే నెవరి దగ్గర నుండి డబ్బు తేవాలి? ఎలా తేగలను...? నేను నిరుపేదను... నాకు అప్పుకూడ యిచ్చే వారు లేరు. ఎవరు ఇస్తారులే నావంటి బీదవానికి! ఇంతకూ నా ఖర్మ...

తండ్రి నడగాలనుకున్నాను. నేను చదివే పట్టణానికి మా గ్రామం ముప్పయిమైళ్ల దూరంలో వుంది. ఒక వేళ ఛార్జీలు పెట్టుకొని పోయి అడిగితే నాన్న మాత్రం ఎక్కణ్ణుంచి తెస్తాడు...? అతనూ పేదేగా...

సాయంత్ర మయేసరికి డబ్బుపిచ్చి పట్టి తలనొప్పి అధికమయింది. కాలేజి నుండి యింటికి వస్తూ ఒక "ఆస్ప్రో" బిళ్ళ కొని నీటితో సహా సేవించి, విచారంగా రోడ్డు వెంబడి నడుస్తున్నాను. ఆ రోడ్డులో జనసంచార మెప్పుడూ ఎక్కువగా వుండదు. నా ఆలోచనలన్నీ రేపటికి డబ్బు ఎలా తేవాలి? ఎవరిని అడగాలి? అన్న సమస్యపై కేంద్రీకరింపబడ్డాయి. ఆస్ప్రో సేవించినా తల నొప్పి తిరుగుముఖం పట్టలేదు.

ఆలోచిస్తూ నిరాశగా నిదానంగా నడుస్తూన్న నాకాలికి ఏదో వస్తువుతగిలి ఒక గజందూరం ముందుకు పోవడమేమిటి, నేను వెంటనే పోయి దానిని తీసుకొనడమేమిటి, అంతా ఒక నిముషంలో జరిగిపోయింది. దానిని చేతికి తీసుకొని చూద్దునుగదా అది ఒక అందమైన మనీపర్సు. నా చేతులు ఆనందంతో అప్రయత్నంగా వణికాయి. గుండె వేగంగా కొట్టుకొనటం ప్రారంభించింది.

రోడ్డులో ఎవరైనా చూస్తారేమోనన్న అనుమానం కలిగి, దానిని వెంటనే జేబులోనికి దొనుపుకొని యింటివేపు బిరబిరా నడవడటం మొదలెట్టాను.

ఆస్ప్రోమాత్ర శక్తివల్లనో, లేక మనీపర్సు దొరికినందువలనో, తలనొప్పి మాత్రం పటాపంచలయింది. గుడిసెలోనికి ప్రవేశించి అడ్డగడె పెట్టాను. జముకాణం మీద నెమ్మదిగా కూచొని ఆతురతతో పర్సు విప్పాను. నా కళ్లు ఆనందంతోనూ, ఆశ్చర్యంతోను అలాగే చలనం లేకుండ ఆగిపోయాయి అయిదునిమిషాలపాటు... అందులో రెండు రూపాయల నోట్లకరెన్సీ కట్ట ఒకటుంది. రెండుమూడుసార్లు బాగా లెక్కించాను. రెండువందలున్నట్టు తేలింది. నా హృదయం నోట్లకట్టపై విహరించసాగింది. అప్పటి నా ఆనందాన్ని, అనుభూతిని వర్ణించేందుకు ఏ కవికిగూడ సాధ్యం కాదేమో...

ఈ ఆలోచనలకు గమ్యస్థానం అంటూ ఏమీ లేకపోయింది. ఇంతకూ దీన్ని ఏ దౌర్భాగ్యుడు పోగొట్టుకొన్నాడో? అన్న ఆలోచన స్ఫురించేసరికి, పాకెట్‌పై ఏమైనా అడ్రసుంటుందేమోనని చూశాను. అంతవరకూ ఈ డబ్బు ఎవరిదా అన్న ఆలోచన రానందుకు నా మందబుద్ధికి నేనే కించిత్తు చింతపడ్డాను. ఆ పాకెట్‌పై 'సుబ్బరామయ్య' అనీ అతని యింటి అడ్రసు ఒక తెల్ల పేపరుపై వ్రాయబడియుంది.

నాకు డబ్బు దొరికినందుకు నేను సంతోషించినా, అతనిపై ఒక విధమైన సానుభూతి కలిగింది 'పాపం... దురదృష్టవంతుడు' అన్నాను. ఆ దినమే ఒకటో తారీఖు. వచ్చిన జీతాన్నంతా పోగొట్టుకొన్నాడు కాబోలు అని తలంచాను.

నేను నిన్న డబ్బు పోగొట్టుకొన్నప్పుడు నాకు కలిగిన ఆవేదన, దుఃఖము, బాధ, అన్నీ మనసుకు వచ్చాయి. కుటుంబాన్నంతటినీ పోషించే అతనెలా బాధపడుతూంటాడో?'

"అవును బాధపడుతూంటాడు... కాబట్టి నీవు అతనికి తిరిగి దీనిని యిచ్చేయ్" ఆదేశించింది నా ఆత్మ.

నేను దానికి ఏమీ మాటాడలేదు. "అతని బాధలు చాలా వుంటాయ్...పో... అతనికి తిరిగి యిచ్చేయ్...పది మందిలో నీవు మంచివాడవనిపించుకుంటావ్... నీకు కూడా సంతృప్తి కలుగుతుంది" మళ్ళీ అంది అంతరాత్మ నన్ను హెచ్చరించినట్టుగా;

"ఊహూ... నేనివ్వను... అసలెందుకివ్వాలి? నేను డబ్బు పోగొట్టుకున్నప్పుడు నా కెవరైనా తిరిగి యిచ్చారా? లోకంలో న్యాయం అంటూ వుంటే నా పర్సు నాకు ఎందుకు తిరిగి రాదు?... దాని మీద కూడా నా అడ్రస్ వుందిగా... నేనివ్వను... నా అవసరాలన్నీ ఈ డబ్బుతో తీర్చుకుంటా" అంతరాత్మకు ఎదురు తిరిగాను.

"ఒక వ్యక్తి ఒక పనిని ఆచరించలేదని అందరూ అదే తప్పుడు దారిన పడితే లోకంలో 'న్యాయం' అనే పదానికి స్థానం అంటూ దొరుకుతుందా...నీకు డబ్బు యివ్వని వాడు స్వార్థపరుడు... అందుకని నీవూ యిలా అయితే ఎలా? నీవు చదువుకున్నందుకు ఫలమిదేనా... నీవూ బీదవాడివిగా... కష్టం అంటే ఏమిటో నీకు తెలుసుగా... మరి ఎందుకిలా ప్రవర్తిస్తావు.. నా మాట విను. నీవీ డబ్బునంతటిని అతనికి ముట్టచెప్పు" ఆజ్ఞాపించినట్టయింది.

నా మనసు చెప్పింది కూడా సబబుగానే తోచింది.

"నే నతనికి తిరిగి యిస్తే ప్రస్తుతపు నా అవసరాలెలా తీరుతాయి... నేను రేపు పరీక్ష ఫీజు కట్టాలిగా"

"నీకేం భయంలేదు.. అతనికి దీన్ని ముట్టచెబితే నీకు తృణమో, పణమో యిస్తాడు."

"ఒకవేళ ఆ డబ్బు నాకు చాలకపోతే"

"చాలకపోతే... అప్పుగా కొద్ది సొమ్ము అడుగు. తప్పక యిస్తాడు."

చివరకు నా ఆత్మకు లొంగిపోయాను అసలు ఆత్మకు లొంగిపోని మనిషెవ్వడు?...

"సరే...అలాగే చేస్తా" అన్నాను దృఢనిశ్చయంతో...

నేను చేయబోయే పనిని మెచ్చుకుంటూ 'సెభాష్' అంది మనసు. ఆ దినం గడచిపోయింది...

ఉదయాన్నే ఏడుగంటలవేళకు కాలకృత్యాలన్నీ ముగించుకొని, కొంచెం కాఫీ తీసుకొని త్రాగి అడ్రసు ప్రకారం సుబ్బరామయ్య యింటికి పోయాను. ఆ యిల్లు అంత పెద్దది గాదు... మరీ అంత చిన్నదీగాదు. బయట తడికలతో కాంపౌండు అమర్చబడియుంది. మెల్లగా గేటునెట్టి, వాకిటి గుమ్మం దగ్గరగా పోయాను.

లోపల ఒకవ్యక్తి వినాయకుని పటంముందు నిల్చొని, ఏదో దీర్ఘంగా, ఆలోచిస్తూ, అస్పష్టంగా గొణుగుతున్నాడు. అతడు దేవుణ్ణి తిడుతున్నాడని నేను అర్థంచేసుకున్నాను...

ఒక చిరునవ్వు నవ్వుకొన్నాను. మేజామీద కాఫీ చల్లారిపోయిందేమో, ఈగలు నాట్యం చేస్తున్నాయి. అతని వయసు దాదాపు ఏభయి సంవత్సరాలుంటాయని వూహించుకొన్నాను.

మెల్లగా పొడిదగ్గు దగ్గాను. అతను నావైపు తిరగలేదు.

'ఏమండీ' కొంచెం గట్టిగానే పిలచాను.

వులుక్కు పడ్డట్టుగా వెనుదిరిగి 'ఎవరూ...' అన్నాడు.

"సుబ్బరామయ్య గారు మీరేనాండీ"

'అవును...కూచోండి'

ఇద్దరం ఎదురుగా కుర్చీలలో కూచున్నాము.

ప్రసంగం ఎలా మొదలుపెట్టాలో అర్థంకాక.

'మీడబ్బు పోయిందట గదండీ'

'అవును...మీకెలా తెలిసింది'

'అబ్బే...మీ ఆఫీసులో అంటూంటే విన్నాను". అనవసరంగా అబద్ధమాడాను.

"ఈ విషయం యింకా ఆఫీసుకే తెలియదు"

నోట్లో పచ్చివెలక్కాయ యిరుకున్నట్టయింది.

ఎందుకో అతను లేచిపోయాడు.

పదిసెకండ్లకల్లా ఒక ప్యాంటుతో ప్రత్యక్షమయి 'ఇదిగో చూడండి... ఈ ప్యాంటుకు చిల్లిపడినందువలననే పోయింది' అన్నాడు అదోమాదిరిగా ముఖం పెట్టి.

మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు.

"ఇంతకు మీరు ఆఫీసు పనిమీద వచ్చారా".

ఇహ అసలు విషయానికి రాకతప్పదు అనుకొని

"ఏమీలేదండి...మీ డబ్బు నాకు దొరికింది...ఇద్దామనివచ్చా" ఒక్క ముక్కలో సత్యాన్ని వెళ్లగ్రక్కాను.

"ఆఁ...నిజంగా నాదా" అతనిలో ఆనందం. ఆశ్చర్యం కట్టలుతెగి ప్రవహించింది. మాటలు పెగలలేక మెల్లగా వెలువడ్డాయి.

అతని ముఖంలో ఆశ్చర్యంలో మార్పులు, ఆనందం ఛాయలు వున్నాయి. 'ఎలా దొరికింది'.

'త్రోవలో' అంటూ జేబులోంచి పర్సుతీసి మేజాపై పెట్టాను. ఆనందంతో వణకుతున్న చేతులతో దాన్ని తీసుకొని విప్పి లెక్క చూశాడు, 'ఉండండి వస్తా' అంటూ లోనికి పోయాడు. అతనికి కాళ్ళు స్వాధీనం తప్పి సొట్టగా నడుస్తున్నాయి. 'ఏమేవ్' అంటూ అతని భార్యను పిలుస్తూ వంటింట్లోకి కాబోలు పోయాడు. ఏవేవో అస్పష్టమయిన మాటలు వినిపించాయి. అతని భార్య బయటకు వచ్చి నన్ను చూచి మళ్ళీ లోనికి వెళ్లింది. నేను ఏమీ అర్థంచేసుకోలేక శిలాప్రతిమవలె వూరికే చూస్తుండి పోయాను. రెండు నిముషాలకల్లా అతను చేతిలో కాఫీ తీసుకువచ్చి నా ముందు పెట్టి 'తీసుకోండి' అన్నాడు.

వినయంగా కాఫీ పూర్తి చేసి కప్పు మేజాపై పెట్టేశాను.

అతను రెండు రూపాయల కాగితం ఒకటితీసి నాముందుపెట్టి 'దయచేసి ప్రతిఫలంగా దీనిని వుంచండి' అన్నాడు.

వఠ్ఠి రెండు రూపాయలను చూడగానే నాలో నాకు తెలీయకుండగా ఏవేవో ఆలోచనలు కలిగాయి. కొంచెం దుఃఖం, కోపం వచ్చాయి. రెండు నిముషాలు ఏమీ మాట్లాడలేక పోయాను.

'బజారులో దొరికిన రెండువందల రూపాయలను ఏమీ ఖర్చు పెట్టకుండా సగౌరవంగా పువ్వుల్లోపెట్టి తెచ్చి చేతికిచ్చినందుకు యిదేనా ప్రతిఫలం' అని గట్టిగా అందామనుకున్నాను. కాని అనలేకపోయాను.

"నాకీ రెండురూపాయలు వద్దండి...మీరే వుంచండి...కాని నాకు అవసరానికి యిపుడు ముప్ఫయి రూపాయలు అప్పుగా యివ్వండి. పదునైదు దినాలలో తిరిగియిస్తాను" అతని ముఖంలోకి చూస్తూ దీనంగా అడిగాను. ఈ మాటలు వింటూనే అతని ముఖ కవళికలు మారాయి.

'వుండండి వస్తాను' అని లోనికి పోయాడు.

ఇస్తాడో యివ్వడో అన్న సందేహం నన్ను పట్టుకొని వేధించ సాగింది. లోపల ఏవేవో గుసగుసలు వినిపించాయి.

ఐదు నిముషాలకల్లా తిరిగి వచ్చి "సారీ...మిస్టర్. మా ఆవిడ అన్నగారు నిన్న తొంభయి రూపాయలు పంపించమని అర్జెంటుగా కబురెట్టారట... ఇంతవరకూ నాకీ విషయం తెలియదు... ఇప్పుడు మా ఆవిడ అంది. ఏమీ అనుకోకండి... కావలసింటే యింకా ఒక రెండు రూపాయలు యిస్తాను" అన్నాడు నిల్చునే.

ఈ మాటలు వింటూనే నా శరీరం అంతా ముచ్చెమటలు పోయసాగింది. తల గిర్రున తిరుగ నారంభించింది. ఈ మాటలు 'వింటున్నానా' అనిపించింది. లేచి నిలబడ్డాను.

"సార్, దయచేసి... ఎగ్జామినేషన్ ఫీజు కట్టాలి... ఎలాగైనా సర్ధండి సార్... మళ్ళీ పది దినాలలోనే యిస్తా... కావాలసింటే నా అడ్రస్ యిస్తా" దీనంగా వేడాను.

'సారీ...మిస్టర్' ముభావంగా కిటికి నుంచి బయటకు చూస్తూ అన్నాడు. 'ఆఁ... అన్నాను.

'అవునండీ... యింతకుమించి నేను సాయం చేయలేను' అంటూ లోనికి వెళ్లబోయాడు.

'సుబ్బరామయ్యా' గట్టిగా అరచాను.

నిలచి నావైపు చూశాడు.

'మీరు మనుష్యులేనా... వచ్చిన జీతమంతా పోగొట్టుకొని, ఎంతో కష్టపడుతుంటారని దయదలచి తిరిగి యిచ్చినందుకిదేనా ప్రతిఫలం... మీలో మానవత్వం అంటూవుందా! ఇంకొకడైతే దీనిని తిరిగియిచ్చేవాడా? తిరిగి యివ్వకపోతే నీవేంచేసేవాడివి? అంత మాత్రం ఆలోచించలేకపోయావా?' ఉద్రేకంతో గట్టిగా మాటాడేశాను.

అత నేమీ మాటాడలేదు.

'యివ్వరూ...' అంటూ పోయి అతని కాలరు పట్టుకొన్నాను. భయంతో కొంచెం వణికాడు.

'ఏమిటి దౌర్జన్యం...కాలర్ వదలు' అంటూ బలవంతంగా చేతిని విదిలించుకొని లోనికి బిరబిరా నడుచుకుంటూ పోయాడు 'ఛీ కృతఘ్నుడా...' అంటూ పోయి రెండు రూపాయల కాగితాన్ని తీసుకొని నాలుగు ముక్కలు చేసి బయటకు బిరబిరా వచ్చేశాను.

ముఖం అంతా చెమటతో నిండిపోయింది. షర్టువెనకటి భాగం కూడా తడిసి వీపుకు అంటుకుపోయింది.

ఆ యిల్లు నన్ను చూచి వెక్కిరించినట్టయింది. మేఘాలు నన్నుచూచి గర్జిస్తూ, వికటాట్టహాసం చేసినట్టయింది.

తెరువబడిన గేటు 'గెట్‌వుట్' (Get out) అని ఆజ్ఞాపించినట్టయింది.

అప్రయత్నంగా నాకంటి నుంచి జారిన కన్నీటి బొట్టుతో పాటు... నోటి నుంచి "న్యాయమెక్కడ...?" అన్న మాటలు వెలువడి, లీలగా లీనమైపోయాయి.

❖ **కృష్ణాపత్రిక, 2.7.1960**